## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదకూరపాడు: మండలంలోని పెదకూరపాడు, 75 త్యాళ్లూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సత్తెనపల్లి: పట్టణంలోని 11 కేవీ లైన్‌లో చెట్ల కొమ్మల నరికివేత, సబ్ స్టేషన్‌లో మరమ్మతుల వల్ల సత్తెనపల్లి టౌన్‌లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏఈ పి.రవికిరణ్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సత్తెనపల్లి టౌన్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబరు 94941 16238కు ఫోన్ చేయాలని కోరారు.

### నేడు సేంద్రియ సేద్యంపై అవగాహన

కొరిటిపాడు(గుంటూరు): అత్తలూరుపాలెం సేంద్రియ వ్యవసాయ రైతు సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం కర్షకులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు సమాఖ్య చైర్మన్ నూతలపాటి సురేంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదకూరపాడు మండలం అత్తలూరు గ్రామంలోని సమాఖ్య కార్యాలయంలో ఈ సదస్సు జరుగుతుందని వివరించారు. సదస్సుకు నాబార్డ్ మాజీ చైర్మన్ డాక్టర్ గోవిందరాజులు చింతల ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని వెల్లడించారు.

### మానవత్వం చాటుదాం రండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఖాశిం ఖాన్, సభ్యులు

పెదకూరపాడు: ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జమయత్ ఇస్లాం హింద్ ఆధ్వర్యంలో జరిగే రండి మానవత్వం చాటుదాం రాష్ట్ర స్థాయి నైతిక, మానవతా జాగరణ ఉద్యమాన్ని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు ఖాశింఖాన్ కోరారు. పెదకూరపాడులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఖాశిం ఖాన్ మాట్లాడుతూ నవ సమాజ నిర్మాణం, విలువలు, బాధ్యతలతో జీవితం గడపాలనే ఉద్దేశంతో ఉద్యమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మిలటరీ మౌలాలీ, మస్తాన్ షరీఫ్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

### కేంద్ర బడ్జెట్‌లో రైతులకు అన్యాయం

అచ్చంపేట: కేంద్ర బడ్జెట్‌లో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ మండల కార్యదర్శి పున్నా కోటేశ్వరరావు చెప్పారు. పలు డిమాండ్లతో కూడిన విజ్ఞాపన పత్రాన్ని శుక్రవారం ఆయన తహసీల్దారు పద్మారాణికి అందజేశారు. ఇది పేదల బడ్జెట్ కాదని కార్పొరేట్ శక్తుల బడ్జెట్ అని అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం చేస్తోందన్నారు. రాబోయే కాలంలో ప్రజలు బీజేపీకి తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు మధుబాబు, సంపంగుల ఏడుకొండలు, నాగేశ్వరరావు, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

### అండర్-14 కబడ్డీ కోచింగ్ క్యాంపు

మాదల(ముప్పాళ్ళ): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 14 వరకు ఉమ్మడి గుంటూరు జిల్లా బాల బాలికల కబడ్డీ జట్టుకు మాదల జెడ్పీ ఉన్నత పాఠశాలలో కోచింగ్ క్యాంపు జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రమేష్, పీఈటీ ఎస్.కె.ఎమ్.డి.రియాజ్ శుక్రవారం తెలిపారు. 15న చిత్తూరు జిల్లా నగరిలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వీరంతా పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

### పొలంబడి ప్రాముఖ్యంపై అవగాహన

పెరికపాడు(క్రోసూరు): జిల్లా వ్యవసాయాధికారి టి.మురళి శుక్రవారం మండలంలోని పెరికపాడు గ్రామంలో పర్యటించారు. పొలంబడి ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. సేంద్రియ సేద్యంపై కర్షకులు దృష్టిపెట్టాలని చెప్పారు. కార్యక్రమంలో క్రోసూరు ఏడీఏ హనుమంతరావు, ఏఈ వేణుగోపాల్, గ్రామ ఉద్యాన సహాయకులు బి.హరికృష్ణ, ఎంపీఈఓ పాల్గొన్నారు.

### లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): చాగంటివారిపాలెం గ్రామంలో కొత్తగా నిర్మించిన లక్ష్మీగణపతి స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య స్వామి విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారు. ఉదయం సుప్రభాతసేవ, యంత్రములకు అభిషేకాలు, హోమం నిర్వహించారు. జ్వాలా దర్శనం, కన్యాదర్శనం, మహానైవేద్యం, విశేష మంగళ హారతి, తీర్థప్రసాదాల వితరణ, ఆశీర్వచనం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

# పేదల వరాల రేడు సీఎం జగన్

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు స్పష్టీకరణ
- క్రోసూరు సచివాలయం-1 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పాలిట వరాల రేడు అని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చెప్పారు. శుక్రవారం క్రోసూరు సచివాలయం -1 పరిధిలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబం పొందిన లబ్ధి గురించి వివరించారు. కరపత్రాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని వివరించారు. అనంతరం సచివాలయ గృహ సారథులు, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లా చంద మామ, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా, షేక్ గఫూర్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మస్తాన్, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, అనుముల శ్రీనివాసరెడ్డి, చిల్కా దాసయ్య, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, జూనియర్ వెంకట్రావు, గల్లాగురుపాదం, షేక్ ఖాదర్, పాశం శ్రీనివాసరెడ్డి, మాజీ యార్డు చైర్మన్ డాక్టర్ షరీఫ్, మాజీ యార్డు డైరెక్టర్ అంబటి నారాయణ, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గార్లపాటిదాసు, మండల కన్వీనర్ వెలది అప్పారావు, మేదర రోశయ్య, షేక్ షుకుర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శివరామయ్య, పంచాయతీ కార్యదర్శి శరత్‌కుమార్ పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులు వేగవంతం చేయండి**

అనంతరం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పెదకూరపాడు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖ, గృహనిర్మాణ శాఖ గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో మంజూరైన ఇళ్లు, లేఅవుట్ల వారీగా ఇళ్ల నిర్మాణం గురించి, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాల గురించి చర్చించారు. ఇళ్లు నిర్మించుకున్న వారందరికీ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. రైతుభరోసా కేంద్రాలు, సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాల పురోగతి, బిల్లుల చెల్లింపులపై పంచాయతీ రాజ్ అధికారులతో చర్చించారు. డీఎంఎఫ్, ఎంపీ ల్యాండ్స్, సీఎండీఎఫ్ నిధులతోపాటు మండల పరిషత్ నిధుల ద్వారా జరుగుతున్న నిర్మాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. జలజీవన్ మిషన్ పనులతోపాటు ఆర్వో మినరల్ ప్లాంట్ల ఏర్పాటు బిల్లుల చెల్లింపులపై సమగ్రంగా చర్చించారు.

## అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ ఆదినారాయణ

ముప్పాళ్ళ: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టి ఎప్పటికప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ సూచించారు. చాగంటివారిపాలెం రైతు భరోసా కేంద్రంలోని సమావేశ మందిరంలో సాంఘిక దురాచారాలు-నిర్మూలన అంశంపై గ్రామ వలంటీర్లు, సచివాలయ మహిళా పోలీసులకు శుక్రవారం ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు, పేకాట, అక్రమ మద్యం అమ్మకాలు, కోడిపందేలు, గంజాయి రవాణా, ప్రేమ పేరుతో మోసాలను గమనించి సమాచారం పోలీసులకు చేరవేయాలని చెప్పారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. విధుల నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని అభినందించారు. కాల్వలో దూకి ఆత్మహత్యకు యత్నించిన వృద్ధురాలిని కాపాడిన హెడ్‌కానిస్టేబుల్ మాధవరావును అభినందించి బహుమతి అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.పట్టాభిరామయ్య, ఏఎస్ఐ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

- సమస్యలు లేకుండా చూడాలి
- సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి నాగవెంకటలక్ష్మి
- రామకృష్ణాపురం గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



గురుకులంలో విద్యార్థినులతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగవెంకటలక్ష్మి

సత్తెనపల్లి: గురుకుల పాఠశాల, కళాశాలలో సమస్యలు లేకుండా చూడాలని సత్తెనపల్లి సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ నాగ వెంకటలక్ష్మి చెప్పారు. శుక్రవారం సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాల మొత్తం క్షుణ్ణంగా పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. వంటశాలను తనిఖీచేశారు. ప్రిన్సిపల్‌కి, సిబ్బందికి సూచనలు చేశారు. వంటశాలలో దుర్వాసన వస్తోందని, ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. తరగతి గదుల దగ్గరలోనూ దుర్గంధం వస్తోందని, మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తక్షణమే పాఠశాలలోని ఆర్వో ప్లాంట్‌పై దృష్టిపెట్టాలని, దానిని ఎప్పుడు శుభ్రం చేశారనే విషయాలను ఓ పుస్తకం పెట్టి నమోదు చేయాలని చెప్పారు. తాను మళ్లీ పాఠశాలకు వస్తానని, అప్పుడు ఈ లోపాలు కనిపించకూడదని ఆదేశించారు.

**నీటి నమూనాల సేకరణ**

గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం రెండో విడత నీటి నమూనాలను అధికారులు సేకరించారు. ఇటీవల గురుకులంలో వినియోగించే నీటిలో ఈకోలి బ్యాక్టీరియా చేరడంతో విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురుకులంలో నీటి కాలుష్యాన్ని నియంత్రించేందుకు చర్యలు చేపట్టారు. ఆర్ఓ ప్లాంట్ మరమ్మతులు చేశారు. చెరువు నీటి వాడకాన్ని నిలిపివేశారు. వంటకు బోర్ వాటర్ వినియోగిస్తున్నారు. ఇప్పటికే 380 మంది విద్యార్థినులు గురుకులానికి చేరుకోవడంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఆర్ఓ ప్లాంట్ ఇన్, అవుట్ సైడ్, డార్మెటరీ, హ్యాండ్ వాష్ ఏరియాల నుంచి రెండో సారి నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. కార్యక్రమంలో హెచ్ఈఓలు వెంకట్రావు, ఖదీర్, హెల్త్ అసిస్టెంట్ షరీఫ్ పాల్గొన్నారు.

## దొడ్లేరులో ప్రత్యేకాధికారి పర్యటన



పారిశుద్ధ్యాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి మోహన్‌బాబు

దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు గ్రామంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి జి.మోహన్‌బాబు ట్రాన్సిట్ నడక నిర్వహించారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో పర్యటించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులను, గ్రామ సర్పంచ్ ముక్క అంజలిని పిలిపించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమం నిర్వహించారు. పారిశుద్ధ్యం మెరుగుపై సూచనలు చేశారు. దొడ్లేరు, హసనాబాద్ గ్రామాల్లోని జగనన్న కాలనీలను సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. తర్వాత క్రోసూరు జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో, భోజన ఏజెన్సీ ప్రతినిధులతో మాట్లాడారు. 9వ తరగతి విద్యార్థులతో వినియోగదారుల ఫోరం ఏర్పాటు చేయాలని, వినియోగదారుల హక్కులు గురించి తెలియజేయాలని ఎంఈఓ ఏసురత్నం, హెచ్ఎం ఎ.రాఘవేంద్రరావుకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శివరామయ్య, హౌసింగ్ ఏఈ వెంకట్రావు, దొడ్లేరు పంచాయతీ కార్యదర్శి వెంకయ్య, సచివాలయ కార్యదర్శి సాంబిరెడ్డి పాల్గొన్నారు.

## భజే భక్తాంజనేయ



ప్రత్యేక అలంకరణలో శ్రీభక్తాంజనేయ స్వామి



పూజల్లో మహిళా భక్తులు

సత్తెనపల్లి: పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో గల భక్తాంజనేయ స్వామి ఆలయంలో 23వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ఆలయ అర్చక స్వామి వి.వి.నరసింహాచార్యుల ఆధ్వర్యంలో అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సామూహిక గంధ, సింధూర పూజలు, విశేష అలంకారాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్: గుంటూరు అర్బన్- 1 పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలు(ఆయా) పోస్టులకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సీడీపీఓ కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలీనగర్, గుండారావుపేట, గుజ్జనగుండ్ల, ఫాతిమానగర్ ప్రాంతాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

### వ్యవసాయ సలహా మండలి సమావేశం



రైతులకు సూచనలిస్తున్న ఏఓ దేవదాసు, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి

నకరికల్లు: వరిలో జింక్ లోపం కనిపిస్తోందని నివారణకు చిలేటెడ్ జింక్ ఎకరాకు 200 గ్రాముల చొప్పున వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకు ముడత పురుగు నివారణకు 1500 పీపీఎం వేప నూనెను లీటరు నీటికి ఐదు మిల్లీలీటర్ల చొప్పున కలిపి ఎకరాకు 200 లీటర్లు పిచికారీ చేయాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలలో వర్మీ ఎరువు అందుబాటులో ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

### కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

సత్తెనపల్లి: సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ, పారిశ్రామికవేత్త అదానీ ఆర్థిక నేరాలపై న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సత్తెనపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ సత్తెనపల్లి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సత్తెనపల్లి తహసీల్దార్ కె.నగేష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు, న్యాయవాది, నరిశేటి వేణుగోపాల్, సీపీఐ సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి పి.యిర్మియా, సీపీఐ సత్తెనపల్లి నియోజకవర్గ సహాయ కార్యదర్శి వి.లక్ష్మీ చెన్నకేశవ్ తదితరులు పాల్గొన్నారు.

### యూనియన్ బ్యాంకు వద్ద బాధితుల ఆందోళన

సత్తెనపల్లి: రెంటపాళ్ళ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద బంగారం తనఖా పెట్టిన బాధితులు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. తాము తీసుకున్న నగదు చెల్లిస్తామని, తమ బంగారం తమకు ఇచ్చేయాలని బ్యాంకు ఎదుట బైఠాయించారు. బంగారం ఇవ్వడానికి బ్యాంక్ సిబ్బంది ముందుకు రాకపోగా ఉన్నతాధికారుల ఆదేశాలు రావాలని చెప్పారు. ఆ సమయంలో సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ ఆవుల బాలకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. అనంతరం బ్యాంక్ మేనేజర్‌ను సంప్రదించి బ్యాంక్ తెరుచుకుంటే పూర్తిస్థాయిలో భద్రత కల్పిస్తామని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చే వరకు బ్యాంక్ తెరవబోమని మేనేజర్ చెప్పారు. బ్యాంకుకు తాళాలు వేసుకున్నారు.

### క్రోసూరు యూటీఎఫ్ శాఖ కార్యవర్గ ఎన్నిక



యూటీఎఫ్ క్రోసూరుశాఖ నూతన కమిటీ ప్రతినిధులు

క్రోసూరు: క్రోసూరు మండల యూటీఎఫ్ శాఖ కార్యవర్గ ఎన్నిక శుక్రవారం జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా కుంభా శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా గొడవర్తి లూకా, సహ అధ్యక్షులుగా మంచు మోహన్ బాబు, ధరణికోట పద్మ, ప్రధాన కార్యదర్శిగా బొర్రా ఏడుకొండలు, కోశాధికారిగా షేక్ హుస్సేన్ ఎన్నికయ్యారు. మండల కౌన్సిలర్లు ఎనిమిది మంది, జిల్లా కౌన్సిలర్లు తొమ్మిది మంది, సీపీఎస్ కమిటీ ప్రతినిధులు నలుగురు ఎన్నికయ్యారు. యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమకుమార్, రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి యు.రాజశేఖర్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు పి.శేషగిరిరావు ఎన్నికల అధికారులుగా, పరిశీలకులుగా వ్యవహరించారు.

## వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులు



హాజరైన భక్తులు

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన అన్నపూర్ణాంబిక సమేత కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయం, షిరిడిసాయిబాబా కొత్త ఆలయ విగ్రహప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా శుక్రవారం వేద మంత్రాల నడుమ నిర్వహించారు. కోటప్పకొండ ప్రధాన అర్చకులు కావూరి అయ్యప్పగురుకుల్ సీతారామ్‌ప్రసాద్, బాలకృష్ణాచార్యులు, పరుచూరి శ్రీనివాసరావుచార్యులు, నుదురుపాటి హనుమంతరావు శర్మ ఆధ్వర్యంలో వారం రోజులుగా భక్తులతో వివిధ రకాల పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠా మహోత్సవంలో పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు, ఆయన సతీమణి వసంతకుమారి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో ఉండాలన్నారు. త్యాళ్లూరు గ్రామంలో ఒకేసారి రామాలయం, సాయిబాబా దేవాలయం, అయోధ్య స్వామి దేవాలయం, శివాలయాలను నిర్మించడం పూర్వజన్మ సుకృతమన్నారు. వేలాది మంది భక్తులు ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు వజ్రాల శ్రీనివాసరెడ్డి, ఈదా సాంబిరెడ్డి, కొల్లిశివారెడ్డి, కల్లి శ్రీనివాసరెడ్డి, గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, ఈదా శ్రీనివాసరెడ్డి, మధుసూధన్‌రెడ్డి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దంపతులకు జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. అనంతరం 25వేల మంది భక్తులకు తీర్థప్రసాదాలతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## పారిశుద్ధ్య పరిస్థితుల మెరుగే లక్ష్యం

- పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ రెడ్డి
- నందిగామలో మూడు గ్రామాల ఎల్టీసీలకు శిక్షణ



తడి, పొడి చెత్త విభజనను పరిశీలిస్తున్న డీపీఓ భాస్కరరెడ్డి, అధికారులు, సర్పంచ్‌లు

సత్తెనపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన పారిశుద్ధ్య సేవలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి.భాస్కర్ రెడ్డి చెప్పారు. సత్తెనపల్లి మండలం నందిగామలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రంలో శుక్రవారం నందిగామతోపాటు రొంపిచర్ల, గురజాల మండలం గంగవరం గ్రామాల ఎల్టీసీలకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ క్లీన్ పల్నాడు సాధన దిశగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. తడి, పొడిచెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు అందించాలని సూచించారు. ఎల్టీసీలకు డీఆర్‌పీలు శిక్షణ ఇచ్చారు. అనంతరం డీపీఓ క్షేత్ర స్థాయిలో పర్యటించి తడి, పొడి చెత్త విభజనను పరిశీలించారు. కార్యక్రమంలో డీపీఆర్సీ శ్రీదేవి, మండల ప్రత్యేక అధికారి ఎ.సుధాకర్, ఎంపీడీవో జీవీ సత్య నారాయణ, ఈఓపీఆర్డీ దయాసాగర్, ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, నందిగమ, రొంపిచర్ల, గంగవరం గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ అవసరం

ముప్పాళ్ల మండల ప్రత్యేకాధికారి కాంతారావు



ముప్పాళ్ళ ఎస్సీ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న మండల ప్రత్యేకాధికారి కాంతారావు

ముప్పాళ్ళ: గ్రామంలో పారిశుద్ధ్యంపై శ్రద్ధ పెట్టాలని నరసరావుపేట పశుసంవర్ధశాఖ ఏడీఏ, మండల ప్రత్యేకాధికారి కాంతారావు అధికారులను ఆదేశించారు. ముప్పాళ్ళలో కలెక్టర్ ఆదేశాల మేరకు కాఫీ విత్ క్లాప్ మిత్రలో భాగంగా గ్రామాన్ని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాల్వల్లో మురుగునీరు నిలిచిపోయి ఉండటాన్ని గమనించారు. చేతి పంపు వద్ద నీరు నిలిచి ఇబ్బందికరంగా మారిందని కాలనీవాసులు అధికారుల దృష్టికి తెచ్చారు. అనంతరం చాగంటివారిపాలెం సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని కాంతారావు పరిశీలించారు. జగనన్న కాలనీలను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. అక్కడే పనిచేస్తున్న క్లాప్‌మిత్రతో మాట్లాడి కేంద్రంలో ఎరువుల తయారీ విధానంపై ఆరా తీశారు. అనంతరం గోళ్ళపాడులోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, ఆర్వో ప్లాంటును పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎం.భవానిశంకర్, సర్పంచ్ సతీష్, పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రమాదేవి, ఏఓ అరుణ, ఎంఈఓ ఒంగోలురాజు, ఈఓపీఆర్డీ రూపవతి, కో-ఆప్షన్ సభ్యుడు అజ్గర్‌ఆలీ ఉన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మండల ప్రత్యేక అధికారి మురళి



మధ్యాహ్న భోజన పథకంపై ఆరా తీస్తున్న ప్రత్యేక అధికారి మురళి

అచ్చంపేట: అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి ఐ.మురళి సూచించారు. కొండూరు పంచాయతీ పరిధిలోని శ్రీనివాసతండా, చట్టుబడి తండాలలో శుక్రవారం ఆయన మండల స్థాయి అధికారులతో కలిసి పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగు కాలువలలో పూడిక తీయించాలని, కాలనీలో సిమెంట్ రోడ్లు వేసి, సైడు కాలువలు నిర్మించాలని కాలనీ వాసులు కోరారు. సమస్యలను పరిష్కరించేందుకే తాను వచ్చినట్లు మురళి తెలిపారు. పాఠశాలలకు వెళ్లి మధ్యాహ్న భోజన పథకం పనితీరు, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ వి.రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు చొప్పరపు రామయ్య తదితరులు ఉన్నారు.

### ప్రజా సేవే లక్ష్యం కావాలి



నందిగామలో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న ప్రత్యేక అధికారి సుధాకర్

సత్తెనపల్లి: ప్రజలకు సేవలు అందించడమే అధికారుల లక్ష్యం కావాలని డీఎల్‌డీఓ, సత్తెనపల్లి మండల ప్రత్యేక అధికారి ఎ.సుధాకర్ చెప్పారు. పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండలం నందిగామ ఎస్సీ, ఎస్టీ కాలనీలో గురువారం రాత్రి ఆయన పల్లెనిద్ర చేశారు. శుక్రవారం ఉదయం ట్రాన్సిట్ వాక్ నిర్వహించారు. మండల స్థాయి అధికారులతో కలిసి గ్రామంలోని కాలనీలను సందర్శించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బడిబయట పిల్లల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యార్థులను తిరిగి పాఠశాలలకు పంపేలా నచ్చజెప్పారు. గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ అందుతున్న విధానాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, ఈవోపీఆర్డీ దయాసాగర్, ఎంఈఓ ఎ. శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ పాల్గొన్నారు.